క్లుప్తంగా

రామాపురంలో పూడికతీత పనులు



జేసీబీతో పూడికతీత పనులు

దొనకొండ: మండలంలోని రామాపురంలో వర్షాలకు వీధుల్లో నీరు నిలిచి పోవటంతో పంచాయతీ కార్యదర్శి నాగార్జున్ శనివారం పూడికతీత పనులు చేపట్టారు. గ్రామంలో బజార్ల వెంట నీరు నిలిచి ఉండటంతో సర్పంచ్ గొంగటి సుబ్బమ్మ ఆదేశాల మేరకు పూడికతీత పనులు చేపట్టారు. దీంతో మురుగు నీరు కాలువల ద్వారా బయటకు వెళ్లిపోయింది.

22న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన జాబ్‌మేళ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా శ్రీధర్‌నాయుడు తెలిపారు. జాబ్‌మేళాలో అమర రాజా బ్యాటరీస్, రెన్యెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటున్నాయని, 10వ తరగతి నుంచి పీజీ వరకు అర్హత కలిగి 19 నుంచి 30 సంవత్సరాల నిరుద్యోగ యువతీ, యువకులు ఏ ప్రాంతానికి చెందిన వారైనా పాల్గొనవచ్చని చెప్పారు. వివరాల కోసం కళాశాల స్కిల్ సెంటర్ కో ఆర్డినేటర్ విజయకుమారి ద్వారా తెలుసుకోవచ్చని, సెల్ నంబర్లు: 70131 82284, 63022 20609కు సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



మిరప పంటను పరిశీలిస్తున్న ఏఓ, వీఏఏలు

కురిచేడు: మండలంలో సాగులో ఉన్న పంటలను వీఏఏలు వెంకటేశ్వర్లు, నవీన్‌తో కలిసి మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు శనివారం సాయంత్రం పరిశీలించారు. మండలంలోని కాటంవారిపల్లె, పేరంబొట్లపాలెం గ్రామాల్లో సాగు చేసిన పొగాకు, మిరప పంటలు దెబ్బతిన్నాయని, వాటి గురించి ఉద్యాన శాఖాధికారికి సమాచారం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సజ్జ పంట పూర్తయిందని, బొబ్బర్లు, పెసర పంటలు లేవని తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత మిగిలిన పంటలు పరిశీలించి పంటనష్టం అంచనా వేస్తామని ఆయన పేర్కొన్నారు.

ఆ రోడ్డుకు మోక్షం ఎప్పుడో?


- వర్షానికి అధ్వానంగా మారిన రోడ్డు
- పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు



రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

దొనకొండ: దొనకొండ–గజ్జలకొండ రోడ్డు పరిస్థితి దయనీయంగా మారింది. వర్షానికి రోడ్డుపై అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఎక్కడ గుంత ఉందో.. ఎక్కడ బాగుందో చెప్పలేని పరిస్థితి. ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు వస్తుందోనని ఆయా గ్రామాల్లోని ప్రజలు ఎదురు చూస్తున్నారు. పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డు సైడు జారి ప్రమాదానికి గురవుతుంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్‌లు నిత్యం ఈ రోడ్డు నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఇండ్లచెరువు, గజ్జలకొండ, నాగిరెడ్డిపల్లి, పొట్లపాడు, గానుగపెంట తదితర గ్రామాల ప్రజలు నిత్యం వాహనాలపై వెళ్తుంటారు. ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటనలు కూడా గతంలో జరిగి ఉన్నాయి. అంతేకాకుండా ఆటోలు ప్రమాదానికి గురయ్యాయి. రాత్రి పూట ఈ రోడ్డు మీద ప్రయాణం చేయాలంటే ఎదురు వచ్చే వాహనాలు తప్పించబోయి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. గ్రామాల్లోని ప్రజలు నిత్యం మండల కేంద్రమైన దొనకొండకు అనేక పనులపై వచ్చి వెళ్తుంటారు. అంతేకాకుండా పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్లు సైతం ఆటోలు తిప్పేందుకు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు ఎత్తుపల్లాలుగా ఉండటంతో ఆటోలు ఎక్కడ దెబ్బతింటాయోనని ఆందోళన చెందుతున్నారు. వర్షం పడిన సమయంలో రోడ్డు మొత్తం నీరు చేరి వాహన చోదకులకు రోడ్డు కనపడటం లేదు. ఎన్నిసార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టి వాహన చోదకులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రమాదాలు జరుగుతున్నాయి



రోడ్డు అధ్వానంగా తయారవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దొనకొండ నుంచి రాత్రి వేళల్లో గ్రామానికి చేరుకోవాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. వాహనాలు కిరాయికి రావటం లేదు. రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టాలి.

– పైడిపోగు రామయ్య, మాజీ సర్పంచ్, ఇండ్లచెరువు

వర్షాకాలం ఇబ్బందిగా ఉంది



నిత్యం ఈ రోడ్డు నుంచి వ్యవసాయ పనులకు వెళ్లాల్సి వస్తోంది. వర్షం పడిన సమయంలో చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. మండల కేంద్రం దొనకొండకు వ్యవసాయ పనులపై మార్కాపురం వెళ్లాలంటే ఈ రోడ్డే దిక్కు. మరీ ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు నిత్యం దొనకొండకు వచ్చి వెళ్లాల్సి ఉంటుంది. వర్షం పడిన రోజు విద్యార్థులు బడికి రావటం మానుకుంటున్నారు. అధికారులు వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– వెన్నపూస చెంచిరెడ్డి, ఇండ్లచెరువు

ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ



ప్రవహిస్తున్న గుండ్లకమ్మ

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట సమీపంలో గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. తుఫాన్ ప్రభావంతో వాగు ప్రవహించడంతో రెవెన్యూ సిబ్బంది అప్రమత్తమయ్యారు. గ్రామ వీఆర్‌ఓను ప్రవహించే గుండ్లకమ్మ వద్దే ఉండాలని తహసీల్దార్ బి.రమాదేవి ఆదేశించారు. గ్రామస్తులు ఎవరూ గుండ్లకమ్మ వద్దకు వెళ్లవద్దని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. తుఫాన్ ప్రభావం విపరీతమై వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, పాదాచారులు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు.

పాఠశాల స్థలం ఆక్రమణ



పాఠశాల ఆవరణలో స్తంభాలు పాతిన అధికార పార్టీ నాయకులు

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఖాళీ స్థలాన్ని కూటమి నాయకులు కొందరు ఆక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ సంఘటన మండలంలోని చాపలమడుగులో శనివారం వెలుగు చూసింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గత ప్రభుత్వంలో నాడు–నేడు కింద అభివృద్ధి పనులు జరిగాయి. అందులో భాగంగా పంచాయతీ తీర్మానం, గ్రామస్తుల ఆమోదంలో ప్రహరీ కూడా నిర్మించారు. ప్రహరీ నిర్మించేటప్పుడు పాఠశాల ఎదుట అక్రమంగా ఆక్రమించుకున్న బంకులను సైతం తొలగించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ రాగానే వారు పాఠశాల ప్రహరీ దాటి స్థలాన్ని ఆక్రమించుకునేందుకు పాఠశాల ఆవరణలో స్తంభాలు సైతం పాతారు. ముందున్న పాఠశాల ప్రహరీ కూల్చే ప్రయత్నం చేసేందుకు సిద్ధం కావడంతో పాఠశాల హెచ్ఎం అప్రమత్తమయ్యారు. విషయాన్ని ఎంఈవో దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఎంపీడీవో, తహసీల్దార్, ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై మార్కాపురం సబ్ కలెక్టర్ సోమవారం విచారణ చేసే అవకాశం ఉందని స్థానిక అధికారులు పేర్కొంటున్నారు.

నమ్మండి.. ఇది నేషనల్ హైవేనట!



గుంతలతో నిండిన జాతీయ రహదారి

పుల్లలచెరువు: నిత్యం వందలాది వాహనాలు తిరిగే నేషనల్ హైవే (565) ఇలా ఉందేంటి అనుకుంటున్నారా.. అవును గుంతులు పడి.. చుట్టూ జూలుపార చెట్లతో నిండి ఉంది. 565 నంబర్ రహదారి హైదరబాద్ నుంచి నంద్యాల వరకు వెళ్తోంది. ఈ రహదారి కొంత భాగం పుల్లలచెరువు మండలంలో ఉంటుంది. నిత్యం ఈ రహదారిలో వందలాది వాహనాలు వెళ్తుంటాయి. వాహన శ్రేణిలో అధికారులు, రాజకీయ నాయకులు ప్రయాణం చేస్తుంటారు. ఆ దారిన ప్రయాణించే వారి బాధలు చెప్పేవి కావు. గుంతల్లో వాహనాలు దిగబడి, ఛాయిస్‌లు విరిగి నరకయాతన అనుభవిస్తుంటారు. అధికారులు మాత్రం కనీసం గుంతల్లో మట్టి పోయిద్దామని కూడా అనుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు, వాహనాల డ్రైవర్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి చెట్ల తొలగించడంతో పాటు గుంతల్లో మట్టి పోసి రోడ్డు సక్రమంగా ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

మాజీ సర్పంచ్ కొండమ్మకు ఎమ్మెల్యే తాటిపర్తి నివాళి

పెద్దారవీడు: మండల పరిధిలో గొబ్బూరులో మాజీ సర్పంచ్ ఏలూరి కొండమ్మ మృతదేహానికి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పూలమాల వేసి శనివారం నివాళులర్పించారు. మృతురాలు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, సర్పంచ్ అంగిరేకుల ఆదినారాయణ, తిరుమలనాథస్వామి ఆలయం మాజీ చైర్మన్ దుద్దెల వెంకటరెడ్డి, నాయకులు తోకల ఆవులయ్య, గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వల్లెల ఈశ్వరరెడ్డి, బట్టగిరి రమణారెడ్డి పాల్గొన్నారు.



కొండమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న అంకె శ్రీను

కురిచేడు: వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా స్థానిక వాల్మీకి బజారులో అంకె శ్రీను ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. శనివారం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ఉంచి గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తుఫాన్ దెబ్బకు రైతన్నల విలవిల



పత్తి పంటలో నిలిచిన వర్షం నీరు



వర్షం నీటిలో పొగాకు మొక్కలు

పెద్దారవీడు: ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటలు వర్షం కారణంగా దెబ్బతినడంతో అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు. వారం రోజుల నుంచి ఎడతెరపి లేకుండా మండలంలో కురిసిన వానలతో అనేక మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. పత్తి, మిరప, టమోట, చిక్కుడు, ఉల్లి, పొగాకు పంటలు చేతికొచ్చే దశలో కళ్లెదుటే నేలపావుతుండటంతో రైతన్నలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. మరో రెండు మూడు రోజులు వర్షం కురిస్తే పంటలపై ఆశలు వదులుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 500 ఎకరాల్లో టమోటా, చిక్కుడు, బెండ, బీర, తదితర కూరగాయలు పంటలు పండిస్తున్నారు. అధిక వర్షాలతో పంటలు దెబ్బతినడం ఒక కారణమైతే పంటలకు తెగుళ్లు వ్యాప్తి చెందడం, మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేకపోవడం మరో కారణమని, పెట్టుబడులు తిరిగిరాని సమయంలో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. రైతులు సాగు చేసిన పంటలు 50 శాతం మేర దెబ్బతింది. ఆరుతడి పంటల్లో నిలిచిన నీటిని త్వరగా బయటకు పోయేందుకు కాల్వలను ఏర్పాటు చేసుకునే పనిలో ఉన్నారు. వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

అందుబాటులో వైన్‌షాప్‌లు

- పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో సేవిస్తున్న మద్యం
- గతంలో ఊరికి దూరంగా ప్రభుత్వ వైన్‌షాప్‌లు
- నేడు అందుబాటులోనే మద్యం దుకాణం



త్రిపురాంతకం పంచాయతీ కార్యాలయం వద్ద మందుబాబులు

త్రిపురాంతకం: మద్యం దుకాణాలు నిన్న మొన్నటి వరకు ఊరికి దూరంగా ఉండేవి. నేడు గ్రామం నడిబొడ్డున వైన్‌షాప్‌లు ఏర్పాటు చేశారు. అది ప్రభుత్వ కార్యాలయమా లేక పది మంది ఉండే పబ్లిక్ ప్లేసా అని తేడా లేకుండా పోయింది. త్రిపురాంతకం గ్రామ పంచాయతీ కార్యాలయం మందుబాబులకు అడ్డాగా మారింది. మద్యం తాగేందుకు అనువుగా ఉన్న ప్రాంతాల్లో మద్యం ప్రియులు తిష్ట వేస్తున్నారు. రోడ్డుపైనే ఈ విధంగా మద్యం సేవిస్తూ చూపరులను ముక్కున వేలేసుకునేలా చేస్తున్నారు. అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర పబ్లిక్ ప్లేస్‌లో లిక్కర్ తాగేందుకు పాల్పడుతున్న వారికి తగిన సూచనలతో కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఊరికి దూరంగా మందు షాపులు ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు ఏర్పడలేదు. ప్రస్తుతం మద్యం అమ్మకాలు అందుబాటులో ఉండటంతో ప్రధానంగా మహిళలు, పిల్లలకు ఇది కొత్త ఇబ్బందులు తెచ్చిపెట్టేలా ఉందన్న అభాప్రాయం వ్యక్తమవుతోంది. భవిష్యత్‌లో ఇంకెలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారులు దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

ఖైదీల్లో మార్పు రావాలి




మాట్లాడుతున్న జిల్లా జడ్జి భారతీదేవి




ప్రభుత్వ హైస్కూల్లో భోజనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శివశంకరరెడ్డి


దర్శి: పలు నేరారోపణలతో శిక్షలు పడిన ఖైదీల్లో మార్పులు వచ్చేందుకు వారిని జైలులో పెడతారని జిల్లా జడ్జి భారతీదేవి అన్నారు. స్థానిక సబ్‌జైల్‌ను ఆమె శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భారతీదేవి మాట్లాడుతూ తాము చేసిన తప్పు ఒప్పులు తెలుసుకుని క్షమాగుణం అలవర్చుకోవాలని ఖైదీలకు సూచించారు. మంచి మనస్సు, మంచి గుణంతో ఆలోచిస్తే తప్పులు జరగవన్నారు. క్షణికావేశంలో జరిగిన తప్పులతో జైలుకు వచ్చి జీవితాలు నాశనం చేసుకోవద్దని చెప్పారు. రాజీ మార్గం ఎంచుకుని కేసుల్లో రాజీ చేసుకుంటే మంచిదన్నారు. సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శివశంకరరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి వి.ప్రత్యూష పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ హైస్కూల్, బీసీ హాస్టల్‌ను సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు ఎస్.శివశంకరరెడ్డి, పొదిలి జూనియర్ సివిల్ జడ్జ్ వి.ప్రత్యూషలు తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సొంత పిల్లలకు పెట్టినట్లు మంచి ఆహారం అందించాలని సూచించారు. ప్రభుత్వం అందించే మెనూలో లోపాలు లేకుండా సక్రమంగా అందిస్తున్నారా.. అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



కెనరాబ్యాంకులోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న ఖాతాదారులు



బ్యాంకు వీధిలో నిలిచిన నీరు



కుండపోతగా కురుస్తున్న వర్షం

కురిచేడులో కుండపోత

- వీధులు జలమయం
- లోతట్టు ఇళ్లలోకి నీరు



తటాకంలా మారిన పశువైద్యశాల ప్రాంగణం



శ్రీనివాసనగర్ కాలనీలో జలమయమైన ఓ వీధి

కురిచేడు: మండల కేంద్రం కురిచేడులో శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి వీధులన్నీ జలయమయ్యాయి. సడన్‌గా ఉరుములు.. మెరుపులతో వచ్చిన వర్షం సుమారు గంటపాటు దంచింది. 18 మిల్లీమీటర్ల వర్షం కురిసి ఉండవచ్చని అంచనా. ఈ వర్షానికి స్థానిక బ్యాంకు వీధి, శ్రీనివాస నగర్‌లోని వీధులు జలయమమయ్యాయి. పశువైద్యశాల ప్రాంగణమంతా జలమయమై తటాకాన్ని తలపించింది. కెనరా బ్యాంకు, వెంకటరెడ్డి స్వీట్ షాపులు జలదిగ్బంధంలో కూరుకుపోయాయి. బ్యాంకు లోపలకు వెళ్లేందుకు కూడా అవకాశం లేక ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీ వెంటనే స్పందించి డ్రైనేజీని శుభ్రం చేయించడంతో నీరు బయటకు వెళ్లిపోయింది. ఇప్పటికే పంటలు ఉరకలెత్తుతున్నాయి. ఈ తరుణంలో కురిసిన వర్షం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

ఇరుకు రోడ్లలో వ్యాపార సముదాయాలు

- రద్దీతో అవస్థలు పడుతున్న వినియోగదారులు



అమ్మవారిశాల వీధిలో వినియోగదారుల రద్దీ

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు ఇరుకైన వీధుల్లో ఉండటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయాలంటే మండల కేంద్రం పెద్దదోర్నాలకు రావాల్సిందే. ఈ నేపథ్యంలో నిత్యం కొనుగోలుదారులతో కొన్ని వీధులు కిటకిటలాడుతుంటాయి. ఇక ముఖ్యమైన పర్వదినాలైతే ఇక ఈ వ్యాపార సముదాయాలు ఉండే వీధులు ఇసుక పోస్తే రాలనంత బిజీగా మారతాయి. ఇందుల్లో ముఖ్యంగా మండల కేంద్రంలోని అమ్మవారిశాల వీధి, గాంధీ వీధుల్లో నిత్యావసరాల దుకాణాలు, వస్త్ర దుకాణాలతో పాటు మరి కొన్ని హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. దీంతో రోజూ వందల సంఖ్యలో ఆయా దుకాణాలకు కొనుగోలుదారులు వస్తుంటారు. ఆయా వీధులు ఇరుకుగా ఉండే రహదారులతో కొనుగోలుదారులు అక్కడకు వెళ్లాలంటేనే బెంబేలెత్తుతున్నారు. పూర్తి స్థాయిలో రద్దీగా ఉండే ఆ రహదారుల్లో ఒకరినొకరు తోసుకుంటూ తోసుకుంటూ వెళ్లలేని పరిస్థితి ఉందని వినియోగదారులు వాపోతున్నారు. దీనికి తోడు ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువ స్థాయిలో ఉంటుందని వారు వాపోతున్నారు. గతంలో ఆ రహదారిలోనే ఓ ముఖ్యమైన బ్యాంకు ఉండేదని, అప్పుడు ఆ వీధిలోకి వెళ్లాలంటే యుద్ధం చేయాల్సి వచ్చేదని, ప్రస్తుతం ఆ బ్యాంకు వేరే ప్రాంతంలోకి మార్చటంతో కొంత రద్దీ తగ్గిందని కొందరు పేర్కొంటున్నారు. దీంతో పాటు మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అదే కావటంతో మరింత ట్రాఫిక్ రద్దీ ఉంటుదని పేర్కొంటున్నారు. ఎక్కువగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు అడ్డుగా పెట్టి ఉండటంలో ఎక్కువగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు వాపోతున్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నప్పుడు మహిళల ఇబ్బందులు అన్నీఇన్నీ కావని, కొన్నిమార్లు రద్దీ సమయాల్లో కొందరు నగదుతో పాటు మరికొన్ని విలువైన వస్తువులు చోరీకి గురయ్యే అవకాశం ఉందని, అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఆయా వీధులను విస్తరించాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు.

ఆంజనేయ స్వామి గుడిలో చోరీ



చోరీకి గురైన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం

పుల్లలచెరువు: పుల్లలచెరువుకు సమీపంలో ఉన్న శ్రీ చౌటపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ పూజారి ఎప్పటి మాదిరిగానే శనివారం ఉదయం గుడికి వెళ్లి తలుపులు తీయడంతో గుడిలో ఉన్న పెద్ద గంట, దాదాపు 30 చిన్న గంటలు కనిపించలేదు. ఉత్తర ద్వారం వైపు ఉన్న గడియ పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు గంటలను చోరీ చేసినట్లు గుర్తించారు. వీటి విలువ దాదాపు రూ.30 వేలు ఉంటుందని, చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ పూజారి ఉమామహేశ్వరశర్మ తెలిపారు.